# నరకం నుండి ఉత్తరం

అదృశ్య లోకము
నిన్న, నేడు, రేపు
ప్రభువు వచ్చు పర్యంతము

ప్రియ స్నేహితుడా,

నాయొద్ద నుండి వినడం నీకు ఆశ్చర్యం కలిగించవచ్చు. వాస్తవంగా, నాకు నేనే ఆశ్చర్యపోతున్నాను. సజీవులుగా ఉన్నవారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం యింతకుముందెన్నడు జరుగని పని. ఎందుకు ఈలాటి అవకాశమియ్యబడిందో తెలియదు కాని యిప్పుడు దాన్ని బహుగా సద్వినియోగం చేసికొంటాను.

నా కథ నీకు తెలుసు గనుక వివరాలను తిరిగిచెప్పను. అయితే, నా అనుభవం నుండి నేను ఏమి నేర్చుకున్నానో దాన్ని నేను నీకు తెలుపగోరతాను. నేను బహు ఆలస్యంగా నేర్చుకున్నాను గనుక, ఈ వర్తమానం యితరులకు వెళ్లడానికి నీ మీదనే నేను ఆధారపడతాను. ఇతరులు యిక్కడికి రాకుండునట్లు దయచేసి ఈ పనిచేయి. ఏది యెలాగున్నా, నేను నా కథలో ముందుకు సాగుతాను.

## "నీ జీవితాన్ని దేవుని కొరకు ఉపయోగించు"

నేను ప్రస్తావించే మొదటి సంగతి – ప్రాముఖ్యమైనది కావచ్చు – ప్రజా జీవితానికి ఒక ఉద్దేశముంది. భూమి మీద మనం ఏదో యొక హేతువుకొరకు వచ్చాం. ఆ ఉద్దేశం దేవుని సేవించి ఆయనను మహిమపరచడం. తన జీవితాన్ని దేవుని కొరకు వినియోగించ నేర్చుకున్న నరుడు ఎంత జ్ఞానియైయుంటాడో!

నా జీవితకాలంలో నేను దీన్ని నేర్చుకోలేదు. నేను అంత చెడ్డవాడిగా ప్రవర్తించ లేదు సుమీ. వాస్తవానికి, నాకు తెలిసినంతమట్టుకు, నేను చేసిన పనుల విషయంలో ఏ విమర్శా రాలేదు అయితే, నా తప్పంతా నేను చేయని కార్యాలకు సంబంధించిందే.

నా జీవితం దేవుని కొరకు అర్పించబడిందా అని నీవు నన్ను అడిగినట్టయితే, నేను ఆశ్చర్యపోయి, "అయ్యా, నేను యూదుడను. దేవాలయపు సేవలకు నమ్మకంగా హాజరయ్యాను. నియమింపబడిన బలిని అర్పించాను. ధర్మశాస్త్రం ఆజ్ఞాపించినంత నేనిచ్చాను. నా జీవితాన్ని దేవుని కొరకు వాడావా అని నీవు నన్ను ప్రశ్నిస్తావా!" అని నేను మత సంబంధంగా ఉండడమే నీతిగా ఉండడమని నేను అనుకున్నాను. ఆరాధనలో కలిసికొనడం, బలులు అర్పించడం, యివ్వడం: అవన్నీ మేలైనవే; దేవునికి అప్పగించు కొనడానికి వేరుగా, అవి కేవలం వ్యర్థమైనవే. దేవుడు కోరేది ఆయనకొరకు సమర్పించబడిన జీవితం.

అప్పుడు నా ఆలోచనలను దేవుడు ఎక్కువగా ఆక్రమించుకోలేదు – ఇప్పుడైతే ఆయనను అల్పంగానైనా వీక్షించడానికి తపించుతున్నా – లభ్యంకావడం లేదు.

## “కలిగిన వాటిచే మోసగింపబడ వద్దు”

నా సమస్యల్లో భాగమేమంటే – భౌతికమైన వస్తువులచేతను మోసగింపబడ్డాను. నేడు భూలోకంనుండి అదృశ్యలోకంలోనికి ప్రవేశించే ప్రజలు – ఆ పరిస్థితే యింకా ఉన్నట్టు సూచిస్తున్నారు.

భౌతికమైన సొత్తు నన్ను రెండు విధాలుగా మోసగించింది. మొదటిగా, అవి నాకు ప్రాముఖ్యంగా ఉండేవి. ఆ పరిస్థితిని నేను యిలా విడదీస్తున్నాను (దీన్ని గూర్చి నేను చాల కాలం యోచించాను): నీవు వస్తువులను చూడవచ్చుగాని, ఆత్మను, దేవుని, ఆత్మసంబంధమైన వాస్తవాలను చూడలేవు. ఆత్మ వెనుక నిలిచి, నీ దృష్టిని పొందడానికి వేచియుంటున్నప్పుడు, భౌతికమైన వస్తువులు మానక నీ దృష్టిని డిమాండ్ చేస్తూ ఉంటాయి. పంచేంద్రియాల ద్వారా వస్తువులు లాగుతూ ఆకర్షిస్తూ ఉంటుండగా, ఆత్మ దాని విన్నపాన్ని ఎక్కువ సూక్ష్మంగా చేస్తుంది. భౌతికమైనవి తాత్కలికమైనవి ఎక్కువ ముఖ్యమైనవని (నిజంగా ప్రాముఖ్యమైనవని) తలంచడం ఎంత సులభం! త్వరలోనే ఒకడు అల్పమైన వాటిచేత ఆవరింపబడి – దేవుని మరచిపోవడం జరుగుతుంది.

పైగా, విస్తారంగా వస్తువాహనాలు కలిగియుండడం దేవుని అనుగ్రహానికి రుజువని నేను మోసపోయాను. ఆస్తి పాస్తులు, మనుష్యుల గౌరవంచేత చుట్టబడి, నా జీవితం దేవుని ఆనందింపజేసేదిగా ఉందో లేదో అని ఆలోచించడం కూడా అసాధ్యమైపోయింది. దేవుడు పైవేషాన్ని కాదు హృదయాన్ని చూస్తారన్న సంగతి నేర్చుకొనడానికి ఎంత షాకైపోయానో![1] ఆస్తిపాస్తులు ఎంత మోసగించగలవైయున్నాయో!

నీవు నన్ను అపార్థం చేసికోవద్దు. ఆ కాలంలో, ఊదారంగు వస్త్రాలు, సన్నపునారబట్ట వేసికొంటూ, రాజులను, గొప్పవారిని పోలి ఎంతో సుఖించుతూ ఉండేవాడను. బల్ల భోజనాలను విందులను ఉల్లాసాన్ని అనుభవిస్తూ ఉండేవాడిని. మనుష్యుల పొగడ్తలను సమాజపు మన్ననలను అందుకునే వాడిని. నేడు అవన్నీ నా నోటిలో దుమ్ముగా మారిపోయాయి. ఎరుగుటలో యోగ్యత సంపాదించినవాడనుగా, విలాసాల్లో, కాలం వెళ్లబుచ్చటం పనికిమాలిన తనమే. తెల్లని నీతి వస్త్రాలను ఉదారంగు వస్త్రములు సన్నపునార వస్త్రాలతో వ్యాపారం చేశాను; దేవునితో అనుభవించే నిత్యవిందును భూమి మీద సమృద్ధిగా ఉండడంతో వ్యాపారం చేశాను – బహు హీనమైన వ్యాపారాలే నిజంగా!

సొత్తు కలిగియుండడమే తప్పని నేను అనడం లేదు. సొత్తు మీద ప్రాధాన్యతను నిలపడం, దానిపై దృష్టిని కేంద్రీకరించడమనేది మానవ ఆత్మను నాశనం చేస్తుంది. వస్తువులు నిన్ను వశపరచుకొన్నప్పుడు, నీవు నశించిపోయావన్నమాటే.

ఓ, ఈ పాయింటును ఎంతబలంగా చెప్పాలో అంతబలంగా చెప్పే విధాన మొకటుంది! దేవునికి సమయం లేనంతగా తమ పనితో బంధింపబడినవారికి, తీరికగా ఉన్న ప్రతిక్షణాన్ని యితరుల కొరకు గాక తమ కొరకే వినియోగించుకునే వారికి, ఆత్మసంబంధమైన వాటితోగాక భౌతికమైన విషయాలతోనే అక్కరగలిగియున్న వారికి, నా వ్యక్తిత్వంలోని శక్తియంతటితో ఈ విషయం చెప్పనీయండి: ఆలాటి జీవిత విధానం దాని ఖరీదంత విలువయ్యింది కాదు! ఈ స్థలంలోని ఒకని తొలి క్షణం విలువలను

గూర్చిన జ్ఞానంపై ఆశ్చర్యకరమైన ప్రభావాన్ని కనుపరచుతుంది.

## "నీ అవకాశాలను ఉపయోగించుకో"

ఒక వ్యక్తి చేయవలసిందేమంటే – సేవ చేయించుకొనడానికి గాక, సేవ చేసే అవకాశాల కొరకు చూడాలి. నేను వెనుకకు తిరిగి చూస్తే, నాకు అనేకమైన అవకాశా లుండేవి. ప్రతి అవకాశము నాకు ఏది ప్రాముఖ్యమో దానికి పరీక్షయై యుండినట్లు విచారంతో గ్రహించాను.

ఆ భిక్షగానిని గూర్చి ఆలోచించు, అతని పేరు లాజరు. (ఆ మాదిరిని నేనెన్నడు ఎలా మరచిపోలేను!). నేను ఆ విషయాన్ని గురించి మనస్సుపెట్టాలని తలంచియుండి నట్టయితే, పేద దౌర్భాగ్యుని ఎలా ట్రీట్ చేశానో దానిపై కాకుండ మరి దేనిమీదనైనను ఆధారపడియుండ వచ్చునని నేను చెప్పియుండేవాడనే. నేను ఎంతగా తప్పు చేశాను!

అతని ఉనికిని ఎరిగి ఎరగనట్టున్నా – ఎక్కువగా రోత అనే దృష్టితోనే చూచాను. భిక్షగాళ్లు పాలస్తీనాలో చాలామంది ఉన్నారు. కురుపులు అతని దేహాన్ని కప్పాయి; గనుక బల్లమీద నుండి పడు ముక్కల కొరకు కుక్కలతో అతడు పోరాడవలసివచ్చేది. నాకున్న యింకో లోపమేమి? కొద్దికాలం తరువాత, అతడు నా గవినియొద్ద ఉండేవాడు. అతని గూర్చి తక్కువగా ఆలోచించేవాడను. ఆలోచించడానికి "ముఖ్యమైన" సంగతులుండేయను కునే వాడిని – నేను బుద్ధిహీనుడనైయుంటిని!

ఆ భిక్షగానికి నేనెందుకు సహాయపడలేదని నేను ప్రశ్నించుకుంటే, నేను అనేక జవాబులు సిద్ధం చేసికొని యుండేవాడిని: "నేను దేవాలయపు నిధికి దబ్బిస్తున్నా; వారే అతని పరామర్శింపనీయ్యండి; నేను ఈ ఒక్క భిక్షగాడిని పరామర్శించినట్టయితే, భిక్షగాళ్లందరిని నేను చూడవలసియుంటుంది. అది ఎవనిది కానట్టే నా పని కూడ కాదు."

నేను రెండు విషయాలను చూచుటకు తప్పిపోయాను: (1) ఆ మురికి చెడుగు అనే దానిక్రింద మనిషి ఉన్నాడు ... అత్మగలిగిన మనిషి ... సాటి మానవుడు ఉన్నాడని పట్టించుకోలేదు. అతనికి పరిచర్యచేయ తప్పిపోవడంలో, నేను నా సొంత మానవత్వం లేనివాడనైపోయాను. (2) అతడు నా గవినియొద్దనే ఉన్నందున, అతడు నా ప్రత్యేకమైన బాధ్యతగా నిలిచియుంటాడు. అతడు నా అవకాశమును – నా పరీక్షయునైయున్నాడు – నేను ఆ పరీక్షలో ఘోరంగా ఓడిపోయాను (తప్పిపోయాను).

వ్యక్తిగతంగా మాట్లాడడానికి నాకు అనుమతి లభించిందంటే, మీ కాలాన్ని గూర్చి నేను విన్నదానిని బట్టి (అనుదినం యిక్కడికి వచ్చేవారి యొద్ద నుండి) ఇది అవకాశమున్న తరముగా తెలుస్తుంది. నా రోజులో నేను ధనవంతుడనైయున్నా, నాకు కలిగియుండి నదంతా, అక్కడున్న దీవెనలకు సాటి కాదు. ఇతరులకు సహాయము చేయడంలో అనేక రకాలైన అవకాశాలున్నాయి; దేవుని వాక్యము బోధించే గొప్ప అవకాశము, వందలకొలది మార్గాల్లో ప్రభువును సేవించే అవకాశముండేది. ఎరిగిన వారి యొద్దనుండి ఆలోచన పొందు: దీవెనలను అల్పంగా ఆలోచింపవద్దు. నీ వరాలను దేవుని కొరకు వినియోగించు. మేలు చేయడానికి నీకున్న అవకాశాలను సద్వినియోగం చేసికో.

నశించిపోటానికి దాచుకొనడం, హత్యచేయడం, లేదా దుర్నీతిగా (అవినీతిగా)

బ్రదుకనవసరం లేదని నేను కష్టపడి నేను నేర్చుకొనవలసివచ్చింది. అవసరమైన దంతా ఏమంటే, చురుకుదనంతో కూడిన మంచి జీవితం జీవించడంలో తప్పిపోవడమే.[2]

## "నరకము భయంకరమైన స్థలం"

ఇది నా ఆలోచనల్లో రెండవ దిశకు నడిపిస్తుంది – నేను నేర్చుకొని నీకు చెప్పాలనుకున్న రెండవ విషయం: నీ జీవితాన్ని దేవుని కొరకు వినియోగించు. ఎందుకంటే – "నరకము" బహు భయంకరమైన స్థలం!

"నరకము" అనేది కొటేషన్ మార్కులో పెట్టు – ఎందుకంటె – నాశనపాత్రులు అనుభవించే నిత్యమైన పరిధిలోనికి నేను యింకా ప్రవేశించలేదు – దాన్ని గ్రీకులో గెహెన్న (gehenna) అని అంటారు. ప్రస్తుతానికి నేను మృతుల మధ్యస్థపు స్థితిలో నిలిచియున్నా, మృతులందరు ఉండే అదృశ్య లోకంలో ఉన్నాను. మీ లోకంలో ఉండే కొందరు మామూలైన తర్జుమా[3] మూడు గ్రీకు పదాలను తర్జుమా చేస్తున్నట్టు చెప్పుతారు – "నరకము" అని చెప్పే మూడు రకాలైన దానిని అది సూచిస్తుంది.[4] ఇది బహు తబ్బిబ్బుగా ఉంటుంది. "నరకము" అనే దానికి బదులు (లూకా 16లోని లేఖనంలో) కన్పించే నా కథకు "Hades"[5] అదృశ్యలోకము అని ఉండాలి. ఈ గ్రీకు పదానికి అదృశ్యలోకమని భావం. మృతుల – అదృశ్యలోకమనేది స్థలంకంటే స్థితిని చూపునదై యుంటుంది. ఈ భావాన్ని నీవు సంపూర్ణంగా గ్రహించగలిగే మార్గమేలేదు. గనుక ఏదో ఒక రోజు, నీ మరణానికి ముందు క్రీస్తు రాకడ జరుగకుంటే, నీవు యిక్కడకు వచ్చి నీకు నీవే ఈ స్థలం యొక్క విశేషాలను కనుగొంటావ్.

మంచిగాని చెడ్డగాని మృతుల ఆత్మలుండేది అదృశ్యలోకం. నిత్య (కడపటి) తీర్పుకొరకు మేము వేచియుండే స్థలము యిదే. ఒక "భాగం"లో మంచి వారుంటారు మరో "భాగంలో" చెడ్డవారుంటారు (ఇది సరియైన పద ప్రయోగం కాకపోయినా, విషయం అర్థం కావడానికి చెప్పే మార్గం యిదే). గనుక, నేను యింకా నరకంలో కాదు అదృశ్యలోకంలోనే ఉండి – చివరి కడపటి తీర్మానం కొరకు వేచియున్నాను.

అది చెప్పినమీదట, అసలైన ఆచరణలో, మృతుల లోకంలోని మధ్యస్థపు స్థితికిని – కడవరి స్థితికిని అంత పెద్ద మార్పు కన్పించేలా లేదు. దేవునికి నమ్మకస్థులైనవారు యిక్కడ సంతోషముగా యున్నారు – దేవునికి నమ్మకస్థులం కానివారందరు భయంకరంగా, భయంకరమైన దుఃఖాన్ని అనుభవిస్తున్నారు.

అదృశ్యలోకంలో నేనున్న చోటున ఉండే భయానకమైన స్థితిని ఎరుకపరచడానికి మార్గమేలేదు. అది మానవ గ్రహింపుకు అతీతమైయుంది. ఈ స్థలంలో ఒక సెకండు పాటు ఉంటే, దేవుని యొద్దకు పారిపోవాలని ఒప్పింపబడతాడు. నా వేదనను వర్ణించే నా ప్రయాస సరిపోనిదైయుంది. ఇక్కడికి రాకూడదనే నీ తీర్మానాన్ని బలపరచడానికి కొన్ని వివరాలు సరిపోతాయని అనుకొంటున్నా.

### వేదనకరమైన స్థలము

మొదట, అదృశ్యలోకంలో నేనుండే భాగం వేదనకరమైన స్థలం. ఈ వేదనను

చిత్రించడానికి సరిపోయిన భాషా పదాలు లేవు. ఈ భావనను తెలియపరచడానికి మీ యొద్ద నున్న లేఖనాలు అగ్ని అనే రూపాన్ని వినియోగించాయని నాకు చెప్పారు. ఈ పదచిత్రం మంచిది. ఎప్పుడైనా నిప్పుచేత కాలిన అనుభవం నీకు ఉంటే, అది ఎంత బాధకరంగా ఉంటుందో నీకు తెలుసు. ఆ బాధను గుర్తు చేసికొనడానికి ప్రయత్నించు. తరువాత నీ దేహంలో ప్రతి అంగుళం కాల్చబడడం అనే దాన్ని ఊహించు. చివరిగా, నీ ఆత్మ నిరంతరము అగ్నిలో, ఎల్లవేళ్లలా కాల్చబడుతునే ఉంటుంది. ఎన్నడే కాలిపోని స్థితిని ఊహించి చూడు.

కేవలం దాన్ని గూర్చి ఆలోచిస్తుంటే నాకు పిచ్చెక్కిపోతుంది! ఓ బహు అత్యల్పమైన విశ్రాంతికి! నా వ్రేలికొననుండి జారే నీటి బిందువు ఎంతటిది? అంతదైనా విశ్రాంతిగానే ఉంటుదనుకుంటే ఆలాటి విశ్రాంతి ఏదైనా ఉంటుందా! ఈ బాధ, ఈ వేదన, ఈ నొప్పి, నిత్యత్వమంతటి గుండానా ... నేను దాన్ని ఎలా సహించాలి?

నన్ను నేను దగ్గరకు లాగుకొని ఈ ఉత్తరాన్ని పూర్తి చేయాలి. ఈ పరిస్థితిల్లో నా ఆలోచనలన్నిటిని క్రమమైన రూపంలో ఉంచడం నాకెంతకష్టమో, నీవెన్నడు ఎరిగి అభినందించలేవు. ఆ ప్రయాస నాకు మించినదైయుంది. అయినా, ఒక్క ఆత్మనైనా యిక్కడ రాకుండా నేను ఉంచగలిగినట్టయితే నా ప్రయాస యోగ్యమైనదే.

**జ్ఞాపకముండే చోటు**

ఇది బాధాకరమైన చోటు అనే వాస్తవం కంటె మరీ ఘోరమైన వాస్తవమేమంటే – ఈ స్థలంలో జ్ఞాపకాలుంటాయి. మా రోజుల్లో, మనుష్యులకు ఆత్మ ఉండదని, గనుక మరణంతో ఒకడు స్పృహలేని స్థితిలోనికి ప్రవేశిస్తాడని సద్దూకయ్యులు వాదించేవారు. అది అలాగే ఉంటే ఎంత బాగుండును! అయితే సత్యమేమంటే, మరణానంతరం, – తాను ఎక్కడ ఉన్నాడు, తనకు ఎప్పుడు ఏమి జరుగుతుంది, నిత్యత్వమును గూర్చిన సంగతులు – ఒకనికి బాగా తెలుస్తుంది. బహుగా స్పృహ కలిగియుంటాడు.

భౌతికమైన దేహంనుండి మనస్సు విడివడినప్పుడు, గ్రహింపుకు అధిక సామర్థ్యాన్ని సంపాదించుకుంటుంది. అది ఎందుకో నాకు తెలియదు. మనస్సు, భౌతికమైన దేహము యొక్క హద్దులలో లేనిదై సర్వజ్ఞమైన, సర్వ స్థలాల్లో ఉండగల దేవుని మనస్సుతో యిది ట్యూన్ అవుతుందేమో నీవు రక్షింపబడినవారి పరిధిలో ఉండగలిగి నట్టయితే – నిజంగా అది ఆశ్చర్యకరమైన అనుభూతియే గాని, నీవు నశించేవారి పరిధిలో ఉంటే మాత్రం బహు భీతికొలిపే స్థితియైయుంటుంది. ఉదాహరణకు, నేను అబ్రహామును గుర్తుపట్టగలను – (తాను నీతిమంతుల పరిధిలో, అదృశ్యలోకంలో "ఆ వైపున" ఉన్నాడు), యింతకు ముందు నేను ఆయనను ఎన్నడూ చూడలేదు గదా.

నాకు యింకా నా పాత జ్ఞాపకాలున్నాయి – నేను యిక్కడున్న దాదాపు రెండువేల సంవత్సరాల తరువాత కూడ నా జ్ఞాపకాలు మాసిపోలేదు, కనికరం లేకుండ నా జ్ఞాపకాలు నన్ను వెంటాడుతున్నాయి. "కుమారుడా, జ్ఞాపకముంచుకో ..." అని అబ్రహాము చెప్పిన మాటలను నేనెన్నడు మరువలేను. పోగొట్టుకున్న నా అవకాశాలను నేను ఎలా మరువలేకున్నానో అలాగే! నా జీవితాన్ని నేను వ్యర్థం చేశానో నేను మరువలేకున్నాను!

విమోచన పొందినవారి పరిధిలో ఉండడం ఎంత సులభంగా ఉండేదో నేను మరువలేను!

ఇటీవల వచ్చిన ఒకడు రోదసిలోకి పంపే రాకెట్స్ అనబడే వాహనాలను గురించి చెప్పాడు. దానిని పైకి పంపేటప్పుడు జరిగిన ఏ చిన్న పొరపాటైనా సరే వేలమైళ్ళ ప్రయాణపు దారిని తప్పిస్తుంది అన్నాడు. ఈ సంగతి నిత్యత్వానికి సంబంధిస్తుంది! తప్పుగాని సరిగాని చేయడానికి చిన్న విషయాలు, చిన్న నిర్ణయాలు, అల్పమైన తీర్మానాలు – నిత్యగమ్యాలను నిర్ణయిస్తాయి. నీవు యిక్కడికి వచ్చినట్టయితే, నాకువలెనే "నేను దీన్ని ఎందుకు చేశాను?" "నేను దాన్ని ఎందుకు చేయలేదు?" అంటూ "చిన్న చిన్న" తీర్మానాలను గూర్చియే చింతాక్రాంతుడనై నిత్యత్వం అనుభవించ వలసియుంటుంది.

రక్షింపబడినవారి జ్ఞాపకాలు పోల్చ శక్యముకానివై శుభ ప్రధములై ఉండాలి. అయితే నశించినవారి జ్ఞాపకాలు తలచుకోలేనంత శాపగ్రస్థమైనవైయుండాలి. నీవు ఈ సందేశాన్ని లక్ష్యపెట్టకుండా ఎలాగైనా నీవు యిక్కడికే వచ్చిపడ్డావంటే మాత్రం నేను నిన్ను హెచ్చరించిన సంగతిని, ఈ సంగతిని ఆలోచించనందుకు నిన్ను నీవే నిత్యత్వమంతటిలో దండించుకుంటావు.

**శాశ్వతమైన పరిస్థితి**

విశ్రాంతి దొరికే నిరీక్షణ ఏదైనా ఉంటే, మా పరిస్థితి సహించగలిగేదిగా ఉండేదేమో. వెయ్యి లేక పదిలక్షలు లేక నూరు కోట్లు సంవత్సరాల తరువాత అంతముంటుందని మనం ఎరుగగలిగినట్టయితే, ఏదో ఒక విధంగా ఆ బాధను తట్టుకో గలవేమోననిపిస్తుంది. అయితే పరిస్థితి అది కాదు. ఇక్కడ ప్రారంభమైన వేదన gehennaలో కొనసాగించేది బహు శాశ్వతమయ్యింది.

నేను యిక్కడికి వచ్చిన తొలుత (ఆరంభంలో) అబ్రహాము మాటలు వింటే ఎంత భయంకరంగా ఉన్నాయి! "అంతేకాక ఇక్కడ నుండి మీ యొద్దకు దాటగోరు వారు దాటి పోజాలకుండునట్లును, అక్కడివారు మా యొద్దకు దాటి రాజాల కుండునట్లును, మాకును మీకును మధ్య మహా అగాధముంచబడి యున్నదని చెప్పెను"[6] గొప్ప అగాధము... దేవుని మార్గాన్ని నిరాకరించినప్పుడు[7]మన చేతనే త్రవ్వకొనబడిన గొప్ప అగాధము ... నిత్యత్వ మంతటిలో స్థిరపరచబడిన గొప్ప అగాధము!

నా స్నేహితుడా, నా మాట ఆలకించు: ఈ పరిస్థితినుండి తప్పించుకునే మార్గం ఉంది అని చెప్పే మనుష్యుల మాటలు నమ్మకు. కొంత సొమ్ము చెల్లించితే, సమయం తగ్గింపబడుతుందని చెప్పే మనుష్యుల మాటలు నమ్మకు. వేదన ఎన్నటికి అంతం కాదు. నేడు ఈ బాధలో ఉండే మేము, రేపుకూడ అదే వేదనలో ఉంటాం, యిక్కడ నుండి నూరుకోట్ల సంవత్సరాలైన అదే పరిస్థతి. మాకు ఎన్నడే విశ్రాంతి విరామం ఉండదు. నరకాన్ని ఎదురుచూస్తూ నేడు మేము బాధపడతాము, రేపు నరకం యొక్క నిజస్థితిలో – నిత్యత్వమంతటిలో అలాగే బాధింపబడతాం![8]

## "అక్కర కలిగియుండవలసిన సమయం యిదే"

నేను రెండు సంగతులు నొక్కి చెప్పాను: (1) నీ జీవితాన్ని దేవుని కొరకు వాడు, ఎందుకంటే (2) "నరకము" భయంకరమైన చోటు. ఇది చివరి హెచ్చరికకు నన్ను

నడిపిస్తుంది: అక్కర కనుపరచవలసిన సమయం యిదే.

**ఇతరులను గూర్చి యిప్పుడు అక్కర కలిగియుండు**

మరణం వచ్చేవరకు, మరణించడమనే వింత ఏమో నీకు తెలియదు. నీవు అనేకమైన ప్లాన్లువేస్తుంటావు. అనేక సంగతులు చేయాలని లెక్కించుకుంటావు. ఇంతలో తెగిపోతుంది నీవు చచ్చావు. సిద్ధపడ్డావో లేదో నీ జీవితం అంతమయ్యింది.

నేను దీన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే, నీవు ఎవరికైనా సహాయం చేయాలని ఉద్దేశం కలిగియుంటే, దాన్ని నీవు యిప్పుడే చేయాలి. ఈ రోజు గడవక ముందే నీవు చనిపోవచ్చు. నేను నిన్ను భయపెట్టడానికి ప్రయత్నించడం లేదు; నేను కేవలం వాస్తవాలను చెప్తున్నా.

నాకు అయిదుగురు సహోదరులుండిరి. నేను యింకా బదికేయున్నప్పుడు, నేను ఆలోచింపని ఒక విషయమేమంటే – వారి అత్మల స్థితి. నేను అప్పుడప్పుడు వారిని కలుసుకొంటూ ఉండేవాడిని. ఆయా సందర్భాలలో మా కుటుంబాలు కలిసికొనేవి. అయినా, వారి ఆత్మసంబంధమైన స్థితి నాకు ఎన్నడే పట్టలేదు. నేను చనిపోయిన తరువాత – జీవితమంటే ఏంటి అనే సంగతిని నేను గ్రహించిన పిమ్మట – నశించిన వారి వేదనను నేను అనుభవింప నారంభించిన మీదట – వారి సిద్ధపాటు లేమి నా మనస్సును ప్రధానంగా ఆక్రమించుకుంది. వారికి ఈ సందేంశం అందించబడడానికి నేను విన్న వించుకున్నాను. మనవి చేసుకున్నాను. “మీ జీవితాలు మార్చుకొనండి” ఒకే సందేశం వారి కేకగా వినిపించ నన్ను గాని, లాజరునుగాని యింకెవరినే గాని పంపితే బాగుండునని నేనెంతగానో కోరుకున్నా!

వారియొద్దకు తిరిగి వెళ్లే మార్గం ఏమిలేకపోయింది. మరణించిన వారితో కమ్యూనికేట్ చేయగలమని చెప్పుకునే కొందరున్నట్లు నాకు చెప్పారు. వారు అబద్ధికులుగాని లేక తమ్మునుతామే మోసగించుకునే వారుగాని అయ్యుండాలి. నా సహోదరులకు ఆ సందేశాన్ని అందించే మార్గం ఏదీ లేకపోయింది. నా అవకాశాలన్నీ పోయాయి. ఈ విధంగా, నా సహోదరులు ఒకరి తరువాత ఒకరు చనిపోయారు. వారు ఒకరివెంట ఒకరు యిక్కడికే వచ్చారు. ఒకప్పుడు నేను ప్రేమించినవారి కేకలు బొబ్బలు ఏడ్పులు ఎంత భయంకరంగా ఉన్నాయో! ఏమి చేయను!

నీకు బహు ప్రత్యేకంగా ఉండే ఆ వ్యక్తి ఎవరు? బంధువా? స్నేహితుడా? పొరుగువాడా? ఆ వ్యక్తి యొద్దకు యిప్పుడే వెళ్లు. దేవుని గూర్చి, నిత్యత్వాన్ని గూర్చి అతనికి చెప్పు. (ఎంతో కాలం క్రిందట అబ్రహాము నాకు వివరించిన సంగతిని అతనికి చెప్పు). దేవుని చిత్తాన్ని తెలిసికొనడానికి లేఖనాలే మార్గమట. గనుక, అతనిని లేక ఆమెను తండ్రి యొద్దకు రమ్మని బతిమాలు. వారిని విన్నవించుకొనడంలో పిరికితనంగాని, అహంభావంగాని అడ్డుపడకుండ చూచుకో. వేడుకో, విన్నవించుకో, మనవి చేసికో – ఎందుకంటే ఆత్మ ఆపదలో ఉంది; ఆత్మ నిత్యత్వం ఎక్కడో గడపబోతుంది.

నా మరణం తరువాత కొద్ది కాలానికే, మెస్సీయ సిలువలో చనిపోయారు – మీరు యేసు అని ఆయనను పిలుస్తారు. ఆయన మృతిపొందియుండిన మూడు

దినాలలోగా, ఆయన ఆత్మ అదృశ్యలోకంలోనికి వచ్చింది. మా మధ్యనున్న అగాధం గుండా నేను ఆయనను చూడగలిగాను. మరియు విమోచింపబడినవారి ఆనందపు అరుపులను నేను విన్నాను. ఆయన బహు అద్భుతమైన రక్షకుడై యుండాలి. నీవు ప్రజలకు ఆయనను గూర్చి చెప్పినట్టయితే, అనేకులు స్పందించడానికి యిష్టపడతారు. ఒక వేళ వారు అలా చేయలేదే అనుకో, నీ బాధ్యతను నీవు నెరవేర్చిన వాడవై యుంటావు.

**నిన్ను గూర్చి అక్కర కలిగియుండు**

ఇతరులను గూర్చి నీవు శ్రద్ధను కనుపరచకముందు, నిన్ను గూర్చి నీవు అక్కరగలవాడవై యుండాలి. ఇక్కడ ప్రతివాడు విరామం, విశ్రాంతి అనేవాటి కొరకు విలపించుతూ ఉంటాడు. అదే సమయంలో మరణానంతరపు విరామం మరణానికి ముందున్న విరామమేనని మాకు తెలుసు. అంటే, విరామమనేది మాకు అందు బాటులో లేనిదిగా మిగిలిపోతుంది. అప్పుడు మాకు అవకాశముండేది. యిక యిప్పుడు అది లేదు.

కృపా కాలంలో జీవించి యుండడం ఎంత అద్భుతంగా ఉంటుందో! ధర్మశాస్త్రమును ప్రవక్తల వచనాలలో చెప్పబడిన దీవెనలన్నీ అనుభవించడానికి అది బహు మంచికాలం. ఈ కాలానికి సంబంధించి, రక్షణ షరత్తులు ప్రభువైన యేసు యొక్క సిలువ బలియందు నమ్మిక యుంచడం, దేవుని వైపు మరలడం, క్రీస్తుతో బాప్తిస్మమందు (ముంచబడడం) పాతి పెట్టబడడమని నాకు చెప్పారు.[10] తప్పిపోయిన వారైతే–మారుమనస్సుతో తిరిగి వచ్చి, పాపాలను ఒప్పుకొని ప్రార్థించడమని కూడ చెప్పబడ్డాను.[11] ఇది చాలా సింపుల్‌గా ఉన్నట్టు నాకు తోస్తుంది. వీటిని జరిగించడానికి ఎవరైనా ఎందుకు నిరాకరించాలో నాకు అర్థం కాదు. నా సంగతి నేను మరచిపోతున్నాను: నేను నాకు అనుగ్రహింపబడిన అవకాశాలను పోగొట్టుకున్నాను, గనుక అలాటి విపత్తు తప్పక జరుగవచ్చు.

అది ఎప్పుడు అలాగే ఉండవలెనా? జీవిత విశేషమేమో జనులు ఎరిగినట్టయితే, మరణ యాతనల వెనుక ఏముందో వారు ఎరుగ గలిగినట్టయితే, వారు తమ జీవితాలను తిరిగి పరీక్షించుకొని, అవసరతలను గమనించి ఆ అవసరతలను తీర్చుకొనువారై యుంటారు. గనుక, నా కథను ఎక్కడంటే అక్కడ చెప్పుతునే ఉండు. నీవు కలిసికొన్న ప్రతివానికి ఈ సత్యాలను తెలుపు. ఆత్మల రక్షణ లేక శిక్ష మీ భుజములమీదనే ఉన్నదన్న సంగతిని గూర్చి జనులకు నీ శక్తినంతటిని ఉపయోగించి చెప్పు. ఇలా చెప్పడం వలన, దేవుని సముఖానికి ఒక్కడు నడిపింపబడినా, లేక ప్రభువు యొక్క రక్షణను స్వీకరించడానికి రప్పించబడినా, నా ప్రయాస నిజంగా వ్యర్థం కాలేదు.

మొదట, ఎలాగైనా, నీ సొంత రక్షణ విషయమై జాగ్రత్తపడు. నిత్యత్వం నేనెక్కడ గడపనైయున్నానో, ప్రియమైన స్నేహితుడా, అక్కడ నీవు గడపకూడదని నా కొర్కె.

నీవు నన్ను ఎరిగిన దానిని బట్టి<br>
శాశ్వతమైన వీడ్కోలు (నా నిరీక్షణయై యుంది)<br>
లూకా 16నుండి ధనవంతుడు.

## నోట్సు

కరపత్రిక రూపంలో ప్రచురింపబడిన దాని వర్ణన. అసలు కరపత్రిక Haun Publishing Co., Box 3426, Pasadena, Tx. 77501లో లభ్యమౌతాయి. దిద్దుబాటు Haun అనుమతితో చేయబడింది.

నేను దీన్ని ప్రసంగంగా ఉపయోగించేటప్పుడు, ఎవరైనా ఒకరిచే లూకా 16:19-31ని చదివిస్తాను. ఆ ధనవంతుడు తన సహోదరులతో కమ్యూనికేట్ వీలులేకుండా చేయబడ్డాడని జ్ఞాపకం చేస్తాను. ఒక వేళ వారితో కమ్యూనికేట్ చేసే అవకాశముంటే ఎలా ఉండేది? అని నేను అడుగుతాను. అతని సందేశం ఏమైయుండేదో? లూకా 16లో శక్తివంతమైన సందేశం ప్రకటించడానికి, ఆ ధనవంతుడు నీకు వ్రాయడానికి అనుమతి పొందినట్టు ఊహించుమని కోరుతున్నా.

---

సూచనలు

[1]ధనవంతుడు 1 సమూ. 16:7ను సూచించుతూ ఉండాలి. [2]మత్తయి 25:31-46 అతని మనస్సులో ఉండవచ్చు. [3]ఇది KJVని సూచించియుండవచ్చు. [4]గ్రీకు పదాలు gehenna - అగ్ని గుండం - దుష్టుల యొక్క చివరి నివాసం. Hades అంటే అదృశ్యలోకం. మంచిగాని చెడ్డగాని ఆత్మలు తీర్పుకొరకు వేచియుండే స్థలం. ఇందులో tartarus అనేది అదృశ్యలోకములో భాగమైయుండి దుష్టులు న్యాయపు తీర్పునకు వేచియుండే చోటు. మొదటిదానికి మత్తయి 23:33; రెండవ దానికి అపొ. 2:31; మూడవదానికి 2 పేతురు 2:4లను చూడు. [5]లూకా 16:23 KJVలో "నరకము" అని ఉంది NASBలో "అదృశ్యలోక మని" ఉంది. [6]అబ్రహాము కొటేషన్ లూకా 16:26లో వెరిఫై అవుతుంది. [7]ధనవంతుడు యెషయా 59:1, 2 లేక అలాటి లేఖన భాగాలను సూచిస్తున్నాడేమో. [8]మార్జిన్‌లో మత్తయి 25:46; మార్కు 9:44; ప్రకటన 14:11 ఎవరో చేర్చారు. [9]ఇది అపొ. 2:31తో ఏకీభవిస్తుంది. [10]క్రొత్త నిబంధన లేఖనాలతో ధనవంతుడు మంచి పరిచయాన్ని ప్రదర్శించాడు. మార్కు 16:16; అపొ. 2:38, మరియు రోమా 6:3-7ల మంచి సంక్షిప్త వర్ణనయై యుంది.

[11]ఈ ప్రతిపాదన అపొ. 8:22, 23; యాకోబు 5:16; 1 యోహాను 1:9 మంచి సంక్షిప్త వర్ణన.

**రచయిత గమనిక:** ఈ అసాధారణమైన విధానాన్ని నీవు ఉపయోగించినట్టయితే, ఈ ప్రసంగం లూకా 16:19-31 మీద ఆధారపడిందని నీవు తెలియజేయాలి. ధనవంతుని సందేశంగా దాన్ని అందించాలి. 49 పేజీలోని నోట్సును జాగ్రత్తగా చదివి ఈ ప్రసంగం చేయి.